
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 29 । జూన్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల) : సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 30.590 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 91.784 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.59,970
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,386
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,548
సవర (8 గ్రా)	రూ.44,384

గరిష్టం/కనిష్టం
39.3 /30.0

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. గాలిలో 59 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

ఆనందోత్సాహాలతో బక్రీద్‌ను చేసుకోవాలి

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని ముస్లింలకు కలెక్టర్ హరినారాయణన్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ఆనందోత్సాహాలతో భక్తిశ్రద్ధలతో బక్రీద్‌ను జరుపుకోవాలని, ప్రతి ఒక్కరిపై అల్లాహ్ ఆశీస్సులు ఉండాలని ఆయన కాంక్షించారు.

కుక్క దాడిలో విద్యార్థికి గాయాలు



వరికుంటపాడు : పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసి ఆవరణలో ఆడుకుంటున్న ఓ విద్యార్థిపై కుక్క దాడిచేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన వరికుంటపాడు మండలంలోని తూర్పుచెన్నంపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన బక్కా సంజయ్ రోజులాగే ప్రాథమిక పాఠశాలకు వెళ్లాడు. మధ్యాహ్నం వేళ అందరితో కలిసి భోజనం చేసి అనంతరం పాఠశాల ఆవరణలో ఆడుకుంటుండగా ఓ కుక్క పాఠశాలలోకి వచ్చి సంజయ్‌పై దాడి చేసింది. అక్కడ ఉన్న విద్యార్థులు, హెచ్‌ఎం కుక్కను తరిమేశారు. వెంటనే సమాచారం అందించగా తల్లిదండ్రులు వచ్చి విద్యార్థిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తీసుకెళ్లారు.

పండగలా అమ్మఒడి

జిల్లాలో 1,94,842 మంది తల్లులకు లబ్ధి

• రూ.292.26 కోట్ల నగదు వారి ఖాతాలో జమ
• విద్యార్థుల కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (దర్గామిట్ట) : జిల్లాలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 1,94,842 మంది తల్లుల ఖాతాలకు రూ.292.26 కోట్ల నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ వెల్లడించారు. వరుసగా నాలుగో ఏడాది జగనన్న అమ్మఒడి నిధులను పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విడుదల చేయగా నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పండగ వాతావరణంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, జిల్లా విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. తొలుత అమ్మఒడి నగదుకు సంబంధించిన మెగా చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థుల కలలను సాకారం చేయడమే లక్ష్యంగా, ఎక్కడా ఖర్చుకు వెనుకాడకుండా అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. విద్యావ్యవస్థలో అనేక రకాల సంస్కరణలు అమలు చేస్తూ పేద విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు : జేసీ

చదువుకు పేదరికం అడ్డురాకూడదని, ప్రతి తల్లీ తమ బిడ్డలను చదివించాలనే అమ్మఒడి పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని జేసీ కూర్మనాథ్ అన్నారు. పుట్టినబిడ్డకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ నుంచి విద్యార్థి దశ వరకు వివిధ రూపాల్లో లబ్ధి చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రతి తల్లి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించి మెరుగైన విద్యను అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవానీ, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, డిప్యూటీ డీఈఓ లక్ష్మీప్రసూన, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అమ్మఒడి మెగా చెక్‌ను ఆవిష్కరించిన జేసీ కూర్మనాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు



అమ్మఒడి కార్యక్రమం అనంతరం విద్యార్థినుల ఆనందం

ఊరటగా ఉంది



మా పాప ధరణిని ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ మోడల్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదివిస్తున్నాను. పుస్తకాలు, యూనిఫాం కొనుగోలు చేయాలంటే గతంలో ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు అమ్మఒడితో పాటు విద్యాకానుక, ట్యాబ్స్ వంటివి అన్నీ ఉచితంగా ఇవ్వడంతో మాలాంటి పేదవారికి ఎంతో ఊరటగా ఉంది.

– కృష్ణకుమారి, విద్యార్థిని తల్లి

చాలా సంతోషం



పేద విద్యార్థుల గురించి ఇంతలా ఆలోచన చేస్తారని అసలు అనుకోలేదు. మా పాప షేక్ మహీరా గుప్తా పార్క్ దగ్గర ఉన్న బడిలో ఎనిమిదో తరగతి చదువుతోంది. జగనన్న వచ్చిన తర్వాత పాఠశాలలు పూర్తిగా మారిపోయాయి. మాలాంటి పేదింటి పిల్లలు కూడా డబ్బున్న పిల్లలతో సమానంగా అన్ని సౌకర్యాలతో చదువుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– షేక్ సమీనా, విద్యార్థిని తల్లి

బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

• ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు(దర్గామిట్ట) : బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలను ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవించాలని, అప్పుడే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవచ్చనేది బక్రీద్ తెలియజేస్తుందన్నారు. ముస్లింలు అల్లాహ్ ఆశీస్సులతో పండగను జరుపుకోవాలని కోరారు.

అల్లాహ్ ఆశీస్సులు మెండుగా ఉండాలి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు (దర్గామిట్ట) : ప్రజలపై అల్లాహ్ ఆశీస్సులు మెండుగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలను ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. తమకు ఉన్న దాంట్లోనే ఇతరులకు కొంచెం పంచిపెట్టే దాతృత్వ స్ఫూర్తిని బక్రీద్ కలుగ జేస్తుందన్నారు.

వలస నేతలకు రెడ్ కార్పెట్

• పార్టీ జెండా మోసిన వారికి ఝలక్
• టీడీపీ కేడర్‌లో అంతర్మథనం
• నవ్వులపాలైన సోమిరెడ్డి మైండ్‌గేమ్
• అన్ని నియోజకవర్గాల్లో అదే సీన్
• పొమ్మనలేక పొగబెడుతున్నారని నేతల అలక

జిల్లాలో టీడీపీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతోంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీకి అభ్యర్థులు కరువైపోవడంతో వలస నేతల కోసం అర్రులు చాస్తున్నారు. ఎటువంటి వారైనా సరే.. చివరకు వెన్నుపోటు దారులైనా పార్టీలోకి ఆహ్వానించి ఇన్‌చార్జి పదవులు అప్పగించేస్తున్నారు. కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉన్న నేతలను పొమ్మనలేక పొగబెడుతున్నారు. దీంతో అనేకమంది నేతల్లో అంతర్మథనం మొదలైంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: యువగళం విజయవంతం పేరుతో తెలుగుదేశం పార్టీ జిల్లాలో రాజకీయ విలువలు, సిద్ధాంతాలకు పాతరేస్తోంది. 40 ఏళ్ల చరిత్ర ఉన్న ఆ పార్టీలో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో వలస రాజకీయ పక్షుల కోసం అర్రులు చాస్తుండడంతో పార్టీలో అంతర్గత విభేదాలు అధికమైపోయాయి. కష్టకాలంలో పార్టీ అండగా ఉన్న వారిని కాదని వలస నేతలకు ప్రాధాన్యం ఇవ్వడంపై అంతర్గతంగా తమ్ముళ్లు రగిలిపోతున్నారు.

అన్ని నియోజకవర్గాల్లో అదే..

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. రోజురోజుకు అధికార వైఎస్సార్‌సీపీ గ్రాఫ్ పెరుగుతోంది. అదే సమయంలో టీడీపీ గ్రాఫ్ పడిపోతుండడంతో ఆ పార్టీ కేడర్ నిరుత్సాహంలో ఉంది. దీంతో జిల్లాలో లోకేశ్ పాదయాత్రను కూడా విజయవంతం చేయలేని దుస్థితి నెలకొంది. పార్టీ పరిస్థితి రోజురోజుకు దిగజారి పోతుండడంతో అధిష్టానం దిక్కుతోచక వలస నాయకులకు పెద్దపీట వేస్తోంది. వైఎస్సార్‌సీపీ ద్వారా ఎమ్మెల్యే పదవులు పొంది ఆ పార్టీకే వెన్నుపోటు పొడిచిన ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి రెడ్ కార్పెట్ వేసి ఆత్మకూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో యువగళం బాధ్యతలు అప్పగించారు. పార్టీ పెద్దలంతా వచ్చి వలస నేతలకు మోకరిల్లి మీరే మాకు దిక్కు అన్నట్లుగా బతిమాలుకుని బాధ్యతలు అప్పగించడంపై స్థానిక నేతల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. 2019 నుంచి అధికారం అనుభవించి టీడీపీ నేతలను ముప్పుతిప్పలు పెట్టి, హత్యా రాజకీయాలు, అరాచకాలను ప్రోత్సహించిన నేతలను అక్కున చేర్చుకుని పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం చేస్తారా అంటూ తమ్ముళ్లు భగ్గుమంటున్నారు.

వారికి అన్యాయం

ఆత్మకూరులో ఏకంగా మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడికి ఘోర పరాభవం జరిగింది. అలాగే గూటూరు కన్నబాబును ఏకంగా యువగళం పాదయాత్రకు దూరంగా ఉంచారు. ఇక నెల్లూరు రూరల్‌లో ఇదే సీన్ కనిపిస్తోంది. టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడిగా పార్టీని మోసిన అబ్దుల్ అజీజ్‌కు అన్యాయం జరిగింది. ఆయన కోటంరెడ్డి బ్రదర్స్ అరాచక పాలనపై గళం విప్పారు. తనను ఆర్థికంగా దెబ్బతీశారు. టీడీపీ కార్యకర్తలు, నేతలపై దాడులు చేశారు. పచ్చనేతలను హత్యలు చేయించేందుకు కూడా వెనుకాడని నేతలకు రెడ్ కార్పెట్ వేసి ఆహ్వానించి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంపై అజీజ్‌తోపాటు తమ్ముళ్లు రగిలిపోతున్నారు. కోటంరెడ్డి బ్రదర్స్ చేరికతో టీడీపీ కేడర్‌కే ఏం చెప్పాలో తెలియక లోలోన మదనపడుతున్నారు.

అధిష్టానంపై గుర్రుగా..

కావలి నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మండల నేతగా ఉన్న మాలేపాటికి ఇన్‌చార్జి పదవి ఇచ్చి చేతిచమురు వదిలించిన పార్టీ వెంటనే యూటర్న్ తీసుకోవడంతో తమ్ముళ్లు భగ్గుమంటున్నారు. మైనింగ్ మాఫియా డాన్‌గా ఉన్న డీవీ కృష్ణారెడ్డికి దాదాపు టికెట్ ఖరారు చేశారన్న ప్రచారం జోరుగా సాగడంతో తమ్ముళ్లు పార్టీ అధిష్టానంపై గుర్రుమంటున్నారు. సహజ వనరులను కొల్లగొట్టి రూ.వేల కోట్లు దోచుకున్న మైనింగ్ డాన్‌ను పార్టీలోకి ఆహ్వానించి టికెట్ ఇస్తానని చెప్పడంతో నాయకులు, కార్యకర్తల్లో అగ్గి రాజుకుంది.



వర్గ రాజకీయాలు

ఉదయగిరి టీడీపీలో కూడా వర్గ రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయి. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు పార్టీ బాధ్యతలు చూస్తున్నారు. కానీ ఒక్కసారిగా లోకేశ్‌కు దగ్గరంటూ ఓ ఎన్‌ఆర్‌ఐ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాల పేరుతో పార్టీలో వర్గ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నాడు. బొల్లినేనికి వ్యతిరేక వర్గాన్ని కూడగట్టి ఈ దఫా టికెట్ నాదేనంటూ తెగ హడావుడి చేస్తుండడంతో బొల్లినేని ఏం చేయాలో అర్థంకాక తల పట్టుకుంటున్నారు.

పాపం సోమిరెడ్డి

జిల్లా టీడీపీలో ఒకప్పుడు హవా నడిపించిన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితి ఇప్పుడు దారుణంగా తయారైంది. వరుసగా మూడుసార్లు ఓటమి చెందిన వారికి ఈసారి టికెట్ లేదని లోకేశ్ ప్రకటన చేయడంతో సోమిరెడ్డి పరిస్థితి మరీ దయనీయంగా మారింది. పార్టీలో ఆయన పరపతి రోజురోజుకు తగ్గిపోతోంది. దీనికితోడు అర్థ, అంగ బలాలున్న వలస నేతల రాకతో ఆయన పరపతి మరింత దిగజారే అవకాశం ఉంది.

జీవన ఎరువుల ప్రయోగశాల

నెల్లూరులో తొలి కేంద్రం

• రూ.1.40 కోట్లతో భవనాలు
• రూ.76.50 లక్షలతో పరికరాలు
• వ్యవసాయ శాఖ పర్యవేక్షణ
• ఇప్పటి వరకు వందలాది పరీక్షలు
• కల్తీ ఎరువుల బారి నుంచి రైతన్నల రక్షణకు జగన్ సర్కార్ చర్యలు



నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న జీవన, సేంద్రియ ఎరువుల నాణ్యత నిర్ధారణ ప్రయోగశాల



రైతులు పండించే పంటకు ఎరువుల వాడకం ఎంతో కీలకం. వాటిలో జీవన ఎరువులపై రైతులు ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. వాటిని వివిధ కంపెనీలు అనేక విధాలుగా తయారు చేస్తాయి. అసలు ఈ జీవన ఎరువులు అంటే ఏమిటి.. వాటిని ఎన్ని అంశాల్లో పరీక్షిస్తారు.. ఉండాల్సిన లక్షణాలు ఏమిటి.. ఎక్కడ తయారు చేస్తారో తదితర వివరాలను క్లుప్తంగా తెలుసుకుందాం.

సాక్షి, నెల్లూరు డెస్క్ : భూ మండలంలో సంచరించే జీవుల మనుగడ వాటి శరీరంలో ఉండే సూక్ష్మజీవుల (మైక్రోబ్స్) పైనే ఆధారపడి ఉంటుందనేది శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైన వాస్తవం. మైక్రోబ్స్ ఆయా జీవుల్లో వాటి శరీర పరిమాణాన్ని బట్టి లక్షలు/కోట్లలో ఉంటాయి. ఒక నిర్దిష్టమైన రేషియోలో వాటి సంఖ్య పెరుగుతుంటే.. అదే సమయంలో ఆ స్థాయి నిష్పత్తిలో మరికొన్ని అంతరించిపోతుంటాయి. ఈ మైక్రోబ్స్ ప్రాణి బతకడానికి అవసరమైన న్యూట్రియంట్స్‌ను అందిస్తాయి. ఇవి ప్రాణులకు ఎంత ముఖ్యమో మొక్కలకూ అంతే అవసరం.

మొక్కల ఎదుగుదలకు

సాధారణంగా రైతులు పొలంలోని పైరు ఎదుగుదల కోసం రసాయన ఎరువులను వాడుతుంటారు. అందులో నత్రజని, పొటాషియం, భాస్వరం వంటి పదార్థాలుంటాయి. వాటిని అవసరమైన మేరకే మొక్కలకు వాడాలి. మోతాదు మించితే పైరుకు నష్టం కలుగుతుంది. మరోవైపు ఈ రసాయన ఎరువులు విపరీతంగా వాడటంతో భూమి నిస్సారం అవుతోంది. మ్యూకస్ తగ్గిపోయి జీవం కోల్పోతోంది. దీంతో దాదాపు రెండు దశాబ్దాల నుంచి శాస్త్రవేత్తలు జీవన ఎరువులపై దృష్టి సారించారు. ధరణికి హాని చేయని జీవన ఎరువుల తయారీని ప్రోత్సహిస్తున్నారు.

ఏమిటీ జీవన ఎరువులు

జీవన ఎరువు అంటే మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాలు అందించే ఒక రకమైన మంచి బ్యాక్టీరియాతో కూడిన ద్రవ లేదా మొత్తని పదార్థం. ప్రస్తుతం ఈ జీవన ఎరువులను అనేక కంపెనీలు తయారు చేస్తున్నాయి. ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకుంటున్నాయి. అయితే వాటిలో నిర్దీత మోతాదులో లివింగ్ ఆర్గానిజమ్స్ ఉంటున్నాయా? మైకోరిజాల్ ఫంగీ, బ్లూ-గ్రీన్ ఆల్గే, బ్యాక్టీరియా తగినంతగా ఉంటున్నాయా? తదితర అంశాలపై రైతులకు కలిగే ఇలాంటి సందేహాలను నివృత్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కల్తీ జీవన ఎరువుల బారి నుంచి రైతన్నలను కాపాడేందుకు చర్యలు తీసుకుంది.

జీవన ఎరువుల ప్రయోగశాల

దుకాణాల్లో రైతులకు విక్రయించే జీవన ఎరువులు నాణ్యమైనవో కాదో నిర్ధారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరులో జీవన, సేంద్రియ ఎరువుల నాణ్యత నిర్ధారణ ప్రయోగశాలను ఏర్పాటు చేసింది. రూ.1.40 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ ప్రయోగశాలలో అధునాతన పరికరాలు సమకూర్చారు. మండల స్థాయిలో అధికారులు సేకరిస్తున్న శాంపిళ్లను రీజినల్ సెంటర్ల (అమరావతి, తిరుపతి, విశాఖ, తాడేపల్లిగూడెం)కు మొదటగా పంపుతారు. అక్కడి నుంచి వాటిని డీకోడ్ చేసి నెల్లూరులోని ప్రయోగశాలకు పంపుతున్నారు. ఇక్కడి ల్యాబ్‌లలో ఆ శాంపిళ్లను వివిధ విభాగాల్లో పరీక్షలు నిర్వహించి అవి నాణ్యమైనవో కాదో తెలియజేస్తున్నారు. వీరిచ్చే నివేదిక ఆధారంగా ఒకవేళ అవి సరిగా లేకుంటే వాటిని విక్రయించే లేదా తయారీదారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.



జీవన ఎరువులను పరీక్షించే యంత్రం

రూ. 1.40 కోట్లతో భవనాలు

నెల్లూరులో జీవన ఎరువుల నిర్ధారణ ప్రయోగశాలను ఏర్పాటు చేయాలని 2017లోనే అధికారులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపారు. ఇక్కడ ప్రయోగశాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆర్‌కేవీవై (రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన) పథకం కింద రూ.1.40 కోట్లు కేటాయించింది. దీంతోపాటు ప్రయోగశాలలో పరికరాల కొనుగోలుకు ఎన్‌ఎంఎస్‌ఏ (నేషనల్ మిషన్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్) కింద మరో రూ.76.50 లక్షలు కేటాయించింది. కేంద్రం నిధులు కేటాయించడంతో వ్యవసాయ శాఖ భవనాల్లోనే పరికరాలను ఏర్పాటు చేసి జీవన ఎరువులను పరీక్షిస్తున్నారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీఓ కార్యాలయంలో 12 సెంట్ల స్థలాన్ని భవన నిర్మాణానికి కేటాయించింది. ఈ ఏడాది భవనాల నిర్మాణం పూర్తి కావడంతో ఏప్రిల్‌లో ఈ ప్రయోగశాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు.

ఏ పరీక్షలు చేస్తారంటే?

నెల్లూరులోని ప్రయోగశాలలో జీవన ఎరువులైన రైజోబియం, అజటోబాక్టర్, అజోస్పైరిల్లమ్, మైకోరైజా, పొటాషియం మొబిలైజింగ్ బ్యాక్టీరియా వంటి వాటిలో నాణ్యతా నిర్ధారణ పరీక్షలు చేస్తారు. సేంద్రియ ఎరువులైన వర్మీ కంపోస్టు, ఆర్గానిక్ మెన్యూర్, డీ ఆయిల్డ్ కేక్స్ అయిన వేపచెక్క, ఆముదం చెక్కల నాణ్యతను కూడా నిర్ధారిస్తారు. వివిధ శాంపిళ్లు ఈ ప్రయోగశాలకు రాగానే వాటిని స్టెరిలైజేషన్ చేసిన వస్తువుల్లో ఉంచి వాటిని యంత్రాల్లో 24 గంటల పాటు పరీక్షిస్తారు. బీఓడీ (బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్) ఎంత మేరకు ఉందో తెలుసుకుంటారు. అనంతరం వాటిలో పీహెచ్ (ఉదజని సూచిక), ఈసీ (ఎలక్ట్రికల్ కండెక్టివిటీ), సేంద్రియ కర్బనం, నత్రజని, పొటాషియం, భాస్వరం, హెవీ మెటల్స్ ఎంతెంత స్థాయిలో ఉన్నాయో ల్యాబ్‌ల్లో పరీక్షించి తెలుసుకుంటారు.




ప్రయోగశాలలోని పరికరాలు

ఎన్ని శాంపిళ్లను పరీక్షించారంటే..

ఇక్కడ ప్రయోగశాలను ఏర్పాటు చేశాక ఇప్పటి వరకు 307 జీవన ఎరువులు, 330 సేంద్రియ ఎరువులు, 10 డీ ఆయిల్డ్ కేక్స్‌ల నాణ్యతను పరీక్షించారు. క్వాలిటీ ఉన్నవి, లేనివి సర్టిఫై చేసి వాటిని ఆయా రీజినల్ సెంటర్లకు పంపుతున్నారు. నాణ్యత లేదని నిర్ధారణ అయితే.. వాటిని విక్రయించిన దుకాణాలు, తయారీదారులపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకుంటుంది. ఇలా జీవన ఎరువుల్లో నాణ్యత నిర్ధారణ చేపట్టి రైతులకు మేలు కలిగేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ముదావహం.

నాణ్యతను పక్కాగా నిర్ధారిస్తాం



ప్రయోగశాలకు రీజినల్ సెంటర్ల నుంచి డీకోడింగ్ చేసి శాంపిళ్లు పంపుతారు. అవి ఎక్కడి నుంచి తీసినవో మాకు తెలియదు. మాకు అందిన వాటిని వివిధ విభాగాల యంత్రాల్లో పరీక్షలకు పెడతాం. 24 గంటలపాటు వాటిని పరీక్షించి ఏఏ మోతాదుల్లో బీఓడీ ఉందో (బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్) తెలుసుకుంటాం. అనంతరం వాటి పీహెచ్, ఈసీ తదితరాలు ఏ మేరకు ఉన్నాయో నిర్ధారించుకుని రిపోర్టు తయారు చేసి పంపిస్తాం.

– టి.శివరంజని, ఏఓ

16 మంది ఎస్సైల బదిలీ

నెల్లూరు(క్రైమ్) : జిల్లా వ్యాప్తంగా 16 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని బుధవారం ఎస్పీ ఆదేశించారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఎం.రాజకుమార్ (వేదాయపాళెం నుంచి ఇందుకూరుపేట), జి.అంకమ్మ (నార్త్‌ట్రాఫిక్ నుంచి వేదాయపాళెం), ఎం.శివశంకరరావు (ఆత్మకూరు నుంచి నార్త్ ట్రాఫిక్), కె.ముత్యాలరావు (మనుబోలు నుంచి వీఆర్), జి.అజయ్ కుమార్ (వీఆర్(అటాచ్‌డ్ సెబ్) నుంచి మనుబోలు), ఎం.వెంకటరావు (కావలి రూరల్ నుంచి సౌత్ ట్రాఫిక్), ఎస్.సుమన్ (దగదర్తి నుంచి కావలి రూరల్), డీఎస్.విజయ్‌కుమార్ (దర్గామిట్ట నుంచి దగదర్తి), ఎంవీ రమణయ్య (వీఆర్ నుంచి కందుకూరు రూరల్), ఎం.శివ నాంచారయ్య(కందుకూరు రూరల్ నుంచి చిన్నబజార్), సీహెచ్.ప్రభాకర్‌రావు (వీఆర్ నుంచి సంతపేట), సీహెచ్.వాసు (సంతపేట నుంచి సైదాపురం), వి.మాల్యాద్రి (వీఆర్ నుంచి దిశ), కె.శేఖర్‌బాబు (దిశ నుంచి బిట్రగుంట), ఎ.ప్రభాకర్‌రావు (చిన్నబజారు నుంచి వీసీఆర్), జె.మల్యాద్రి (కావలి టూ టౌన్ నుంచి వీఆర్)కు బదిలీ అయ్యారు.

3 నుంచి లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు

నెల్లూరు (టౌన్) : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు–2023 సంవత్సరానికి సంబంధించి డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్ గ్రేడు పరీక్షలు వచ్చేనెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరుగనున్నట్లు డీఈఓ గంగాభవాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లను www. bre.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డును వెరిఫికేషన్ కోసం సమర్పించాలన్నారు.

క్లుప్తంగా

కత్తితో బెదిరించి సరుడు, నగదు దోపిడీ

అనుమసముద్రంపేట: గుర్తుతెలియని వ్యక్తి కత్తితో వృద్ధురాలిని బెదిరించి మెడలోని సరుడు, నగదు దోచుకెళ్లిన ఘటన మండలంలోని జమ్మువరంలో ఆలస్యంగా బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పల్లాపు రమణమ్మ కరువు పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఓ వ్యక్తి మంగళవారం స్కూటీలో ఇంటికి వచ్చి మీ కుమారుడు హజరత్తయ్యకు యాక్సిడెంట్ జరిగి ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం పొందుతున్నాడు. వెంటనే వైద్యశాలకు రావాలని ఆమెకు చెప్పాడు. స్థానికులు వెంటనే ఆమెను వైద్యశాలకు వెళ్లమని సుమారు రూ.40 వేలు చేతికిచ్చారు. ఆ వ్యక్తి ఆమెను బైక్‌పై తీసుకెళ్లాడు. అడ్డరోడ్డు దగ్గరకు వచ్చే సమయానికి వెంకట్రావుపల్లి వైపు దారి మళ్లించి ఓ చోట ఆపి కత్తిని మెడపై పెట్టి బెదిరించి సుమారు మూడున్నర సవర్ల బంగారు సరుడు, రూ.40 వేలు దోచుకుని పరారయ్యాడు. బాధితురాలు ఏఎస్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

‘వారిని సస్పెండ్ చేస్తే మీ వద్దకొచ్చారు’

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ‘వైఎస్సార్‌సీపీపై విరక్తి చెంది ముగ్గురు ఎమ్మెల్యేలు టీడీపీకి మద్దతు ఇస్తున్నారని ఓ వ్యక్తి మాట్లాడాడు. మా పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారి తీరు నచ్చక సస్పెండ్ చేస్తే మీ వద్దకు వచ్చారు. ఈ విషయం మర్చిపోవద్దు.’ అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ తెలిపారు. నగరంలోని 3వ డివిజన్ ప్రశాంతి నగర్ వద్ద రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, 4వ డివిజన్ సత్యనారాయణపురం సెంటర్ వద్ద రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3, 4 డివిజన్లల్లో రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. తాను, కార్పొరేటర్లు, నాయకులందరం నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. శాసనసభ, మంగళగిరి, మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి గోపురమని పలకడం చేతకాని నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది నారా లోకేశ్ మాత్రమేనన్నారు. లోకేశ్ ప్రసంగిస్తుంటే నవ్వాలో ఏడవాలో కూడా అర్థం కాని పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు సంక్రాంతి అశ్విని, పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని వీడను

- నాపై టీడీపీ అసత్య ప్రచారం చేస్తోంది
- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తి లేదని నెల్లూరు ఎంపీ, ఆ పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో తాను వైఎస్సార్‌సీపీని వదిలి వెళ్తానని టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. గతంలో సోమిరెడ్డికి సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు తగిన విధంగా గుణపాఠం చెప్పినా జ్ఞానోదయం కలగలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో ఎంపీగా అవకాశం కల్పించారన్నారు. జిల్లా ప్రజలు ఆయన నమ్మకానికి ఆమోదం తెలిపి అత్యధిక మెజార్టీతో గెలిపించినట్లు చెప్పారు. ప్రస్తుతం నెల్లూరు రూరల్ బాధ్యతలు అప్పగించారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ గెలుపొంది ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా అధికారంలోకి రాలేరని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని చెప్పారు. తనపై టీడీపీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తే ప్రజలే వారికి ఓటుతో గుణపాఠం చెబుతారని తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అరుణమ్మ, కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): భారతీయ రిజర్వ్ బ్యాంక్ వివిధ అంశాలపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈనెల 21వ తేదీన నిర్వహించిన పోటీల్లో మండల స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన 74 మంది విద్యార్థులు బుధవారం నెల్లూరు దర్గామిట్టలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్న జట్లకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జేసీ కూర్మనాథ్ బహుమతులు ప్రదానం చేశారు. పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రథమ బహుమతి కింద రూ.10 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.7,500, తృతీయ బహుమతి కింద రూ.5 వేలను విజేతల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు. మొదటి బహుమతి గెలుచుకున్న జట్టు వచ్చే నెల 14వ తేదీన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. మొదటి బహుమతి ఎస్.జోత్స్న, టి.ప్రవీణ్ కుమార్ (జిల్లా పరిషత్ హైస్కూల్ శ్రీకొలను, ఏఎస్‌పేట మండలం), ద్వితీయ బహుమతి కె.జ్ఞానేష్, వై.హారిక (జెడ్పీహెచ్‌ఎస్ చిలకలమర్రి, అనంతసాగరం మండలం), మూడో బహుమతి సీహెచ్ విజ్ఞాన జోషిక, ఒ.జోషిత (జెడ్పీహెచ్‌ఎస్ టీపీ గూడూరు) గెలుపొందారు. కార్యక్రమంలో డీఈఓ గంగాభవాని, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ ఉషారాణి, కెనరా బ్యాంక్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ టి.శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

పెళ్లి కావడం లేదని..

- నెల్లూరులో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): పెళ్లి కావడం లేదని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని వెంగళరావ్‌నగర్‌కు చెందిన సయ్యద్ బషీర్, షాహీనా దంపతులకు ఇమ్రాన్ (32), సల్మాన్, రుక్సానా అనే పిల్లలున్నారు. ఇమ్రాన్ ఆటోనగర్‌లో వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లిదండ్రులు ఇమ్రాన్‌కు ఎన్ని పెళ్లి సంబంధాలు చూసినా కుదరలేదు. ఓ వైపు వయసు పెరుగుతుండడం, మరోవైపు తన తమ్ముడికి వివాహం కావాల్సి ఉన్నందున ఇమ్రాన్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. అతడికి తల్లిదండ్రులు సర్ది చెప్పేవారు. ఈనెల 27వ తేదీన ఇమ్రాన్ ఎప్పటిలాగే పనికి వెళ్లాడు. వివాహం కావడం లేదన్న మనస్తాపంతో సాయంత్రం డైకస్‌రోడ్డు సెంటర్‌లో తలకు పూసుకునే మందు తాగి ఇంటికి వచ్చి ఆత్మహత్యాయత్నం గురించి తల్లిదండ్రులకు తెలియజేశాడు. వారు వెంటనే ఇమ్రాన్‌ను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. దీంతో బషీర్ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయము

ఆర్.ఓ.సి.నెం.420/2023/నుడా తేది:28.06.2023

ప్రకటన

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఈ క్రింది తెలిపిన హద్దులలో **గుండ్లపాళెం** గ్రామమునకు చెందిన **సర్వే నెంబర్ 100/1A** బాబానగర్‌లోని స్థల విస్తీర్ణం **1503.25 చ.మీ,** నెల్లూరు నగరపాలక సంస్థ ఆమోదిత మాస్టర్ ప్లాన్, **జి.ఓ.యం.యస్.నెం.11 యం.ఎ & యు.డి. తేది.07.01.2011** ప్రకారం లైట్ ఇండస్ట్రియల్ వినియోగం నుండి నివాస వినియోగ ప్రాంతముగా మార్పు చేయుటకు **ముసాయిదా నోటీస్** జారీ చేయుటకు ప్రభుత్వము వారు సూచనలు జారీ చేసియున్నారు. దీనికి సంబంధించిన **జి.టి.పి / యం.యం.పి మ్యాపు నెం.01/2023/NUDA** అను, **నెల్లూరు నగరపాలక సంస్థ / నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయం** నందు పరిశీలన కొరకు లభ్యముగా గలదని, లైట్ ఇండస్ట్రియల్ వినియోగం నుండి నివాస యోగ్య ప్రాంతముగా మార్పు చేయుటపై ఏ విధమైన అభ్యంతరాలు / సూచనలు ఉన్న యెడల నెల్లూరు నగరపాలక సంస్థ / నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయం / ప్రభుత్వము వారికి తెలియజేయవలసినదిగా కోరి ఉన్నందున, సదరు భూ వినియోగ మార్పిడి పైన ఏమైనా అభ్యంతరాలు/సూచనలు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 15 దినముల లోపున నెల్లూరు నగరపాలక సంస్థ / నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయం / ప్రభుత్వము, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, వెలగపూడి వారికి తెలియజేయవలసినదిగా కోరడమైనది.

హద్దులు (ప్రతిపాదన :1)
ఉత్తరం : బాబానగర్ నివాసపు ప్లాట్లు
తూర్పు : మల్లె అన్నపూర్ణ
దక్షిణం : మల్లె అన్నపూర్ణ మరియు పూండ్ల వెంకురెడ్డి
పడమర : 33 అడుగుల వెడల్పు కాలనీ రోడ్డు

హద్దులు (ప్రతిపాదన :2)
ఉత్తరం : బాబానగర్ నివాసపు ప్లాట్లు
తూర్పు : 33 అడుగుల వెడల్పు కాలనీ రోడ్డు
దక్షిణం : మల్లె అన్నపూర్ణ మరియు పూండ్ల వెంకు రెడ్డి
పడమర : మలె అన్నపూర్ణ

సం/- **టి.బాపిరెడ్డి,**
వైస్ చైర్మన్, నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్

జిల్లా కార్యాలయం: నెం.26-10-79, జర్నలిస్ట్ కాలనీ, నిప్పో ఫ్యాక్టరీ వద్ద, వేదాయపాలెం, నెల్లూరు

2023-25 సంవత్సరములకు సంబంధించి ప్రజా పంపిణీ పథకం క్రింద స్టేజి II ద్వారా ఆహార ధాన్యములు మరియు ఇతర నిత్యావసర వస్తువులు రవాణా చేయుట కొరకై

టెండరు నోటీసు

నెం.పి.డి.ఎస్./స్టేజి II Tr./1/2023 తేది.27.06.2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, నెల్లూరు వారి తరఫున జిల్లాలోని అన్ని మండల స్థాయి గోదాముల నుండి / నిల్వ గోదాముల నుండి వాటికి అనుసంధానింపబడిన మండలాలలోని చౌక ధర దుకాణములకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మరియు ఇతర అన్ని సంక్షేమ పథకాలకు / సంస్థలకు సరఫరా చేయు బియ్యం మరియు ఇతర నిత్యావసర వస్తువులను **2023-25** సంవత్సరములకు స్టేజి II క్రింద రవాణా చేయుటకు సీలు వేయబడిన టెండర్లు కోరబడుచున్నవి. మండల స్థాయి గోదాములు ఈ కేంద్రములలో కలవు. **1) నెల్లూరు, 2) ఇందుకూరుపేట, 3) పొదలకూరు, 4) రాపూరు, 5) కోవూరు, 6) బుచ్చి 7) ఆత్మకూరు, 8) కావలి, 9) వింజమూరు, 10) ఉదయగిరి మరియు 11) కందుకూరు.**

ప్రతి మండల స్టాక్ పాయింటుకు విడి విడిగా టెండరు వేయవలెను. రేటు క్వింటాలు ఒక్కింటికి (దూరంతో సంబంధం లేకుండా) మండల స్థాయి గోదాము లేక జిల్లాలోని నిల్వ గోదాముల నుండి చౌక దుకాణములకు రవాణాతో పాటు దిగుమతి కూలీ కూడా కలిపి ఒకే (FLAT) రేటు వేయవలెను

1. కాంట్రాక్టుకు సంబంధించి టెండరు నిబంధనలలో పేర్కొనబడిన సెక్యూరిటీ డిపాజిట్లు మరియు బ్యాంకు గ్యారంటీ కాంట్రాక్టు పొందబోవు కాంట్రాక్టర్ చెల్లించవలసివుంటుంది.

2. ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ క్రింద ఏదేని జాతీయ బ్యాంకు నుండి **" District Manager, APSCSCL, Nellore "** (నెల్లూరులో చెల్లించునట్లు) వారి పేరున పొందిన **రూ.50000/ 75000/ 100000** (మండల స్థాయి గోదాముకు అనుసరించి) విలువ కలిగిన డిమాండు డ్రాఫ్టు టెండరు తో పాటు చెల్లించవలెను.

3. 10 టన్నుల సామర్థ్యము కలిగిన సొంత మరియు లీజుకు పొందిన వాహనములు టెండరుదారు తప్పక కలిగి వుండవలెను. వివరములు నిబంధనలలో కలవు.

4. టెండర్ దాఖలు చేయు క్రమము:

టెండర్ ఫారములు లభించు పని రోజులు	టెండర్ దాఖలు చేయు ఆఖరు రోజు	సాంకేతిక టెండర్ మరియు ఆర్థిక పరమైన టెండర్ తెరచు రోజు & సమయం
29.06.2023 నుండి 05.07.2023 వరకు మధ్యాహ్నం 12.00 గంటల వరకు,	05.07.2023 మధ్యాహ్నం 2.00 గంటల వరకు.	05.07.2023 సాయంత్రం 5.00 గంటలకు

5. టెండరు పత్రములు (ఐదింటి కాపీలు) అనగా టెండర్ ఫారములు, నిర్దేశములు & నిబంధనలుమరియు మాదిరి ఒప్పంద పత్రము, ఏదేని జాతీయ బ్యాంకు నుండి **" District Manager, APSCSCL, Nellore "** (నెల్లూరులో చెల్లించునట్లు) వారి పేరున పొందిన **రూ.5000/-** విలువ కలిగిన డిమాండు డ్రాఫ్ట్ సమర్పించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వారి కార్యాలయము నుండి పొందవచ్చును.

6. టెండరు షెడ్యూలు నందు ప్రతి మండల స్టాకు పాయింటుకు సంబంధించిన సరుకు రవాణాకు క్వింటాలుకు యూనిట్ ధర సూచించబడినది. ఏ టెండరుదారుడు కూడా యూనిట్ ధర కన్నా తక్కువగా టెండరు వేయరాదు. తక్కువగా వేసినచో టెండరు తిరస్కరించబడి టెండరుదారుడిపై ఇక ముందు టెండర్లలో పాల్గొనకుండా నిషేధము విధించబడును.

7. ఏ కారణము చూపకుండా టెండరులు వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు జాయింటు కలెక్టరు గారికి పూర్తి అధికారము కలదు.

8. విపత్తు సమయములలో మరియు ఇతర ముఖ్య సందర్భాలలో అవసరమైన యెడల తక్కువ వ్యవధిలో ఎక్కువ వాహనములు ఏర్పాటు చేసి ఎంత తక్కువ పరిమాణమునైననూ రవాణా చేయవలసివుంటుంది.

సం/- **ఆర్.కూర్మనాథ్,**
జాయింటు కలెక్టరు & పదవి రీత్యా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్,
ఆం.ప్ర.రా.పౌ.స.సం.లి., నెల్లూరు

వైఎస్ జగన్ వైపే ఎస్సీ, ఎస్టీ, బీసీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి. చిత్రంలో వీరి చలపతిరావు, నాయకులు

- ఎన్నికలొస్తున్నాయంటేనే టీడీపీకి దళితులు గుర్తొస్తారు
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


కొడవలూరు: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని యల్లాయపాళెం మజరా రామాపురంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలొస్తున్నాయంటేనే టీడీపీకి దళితులు గుర్తొస్తారని చెప్పారు. అచ్చెన్నాయుడు దళితులతో సమావేశం ఏర్పాటు చేసి వారిపై ప్రేమ ముంచుకొచ్చినట్లు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. దళితులను చంద్రబాబు పలుమార్లు కించపరుస్తూ మాట్లాడాడని ఎమ్మెల్యే చెప్పారు. పార్టీ జాతీయ అధ్యక్షుడైనా అచ్చెన్నాయుడు ఏర్పాటు చేసిన సమావేశానికి బాబు హాజరు కాలేదన్నారు. వెళ్లి ఉంటే దళితులే తరిమేసే వారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 9 ఏళ్లు, కొత్త రాష్ట్రంలో 5 ఏళ్లు పరిపాలించిన బాబు దళితులకు ఏం చేశారో చెప్పాలన్నారు. పవన్ కళ్యాణ్ ఎన్ని వేషాలు వేసినా ప్రజలు పట్టించుకోరని చెప్పారు.

నేనే నిదర్శనం

డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ దళితులకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందనేందుకు తానే నిదర్శనమని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఒక్క ఎస్సీ నేతకు కూడా దక్కని డీసీఎంఎస్ పదవిని తనకు కట్టబెట్టారని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ జి.జ్యోతి, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, నాయకులు అడపాల మోహనకృష్ణ, నల్లావుల శ్రీనివాసులు, మారం రెడ్డి రంగారెడ్డి, తాటిపర్తి భాస్కర్, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- లింగసముద్రం మండలంలో ఘటన
- మా బిడ్డను భర్తే చంపాడు
- బాధిత తల్లిదండ్రుల ఆరోపణ



మానస మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

లింగసముద్రం: వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన లింగసముద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో బుధవారం జరిగింది. కందుకూరు డీఎస్పీ రామచంద్ర కథనం మేరకు.. అంబేడ్కర్ నగర్‌కు చెందిన పూరిమిట్ల శివకృష్ణ అదే కాలనీకి చెందిన పులి మానస (27) ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో 2018లో వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. కాగా శివకృష్ణ రోజూ మద్యం తాగేవాడు. దీంతో భార్యాభర్తలు తరచూ గొడవలు పడేవారు. శివకృష్ణ తల్లిదండ్రులు, అక్కాచెల్లెలు కూడా మానసను తరచూ వేధింపులకు గురిచేస్తుండేవారు. బుధవారం మధ్యాహ్నం అతను పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో భార్యాభర్తలు ఘర్షణ పడి ఒకరినొకరు కొట్టుకున్నారు. ఈ క్రమంలో శివకృష్ణ భార్య మెడకు చీరతో ఉరివేయడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు చెబుతున్నారు. శివకృష్ణ హైదరాబాద్‌లో ఉన్న తన అక్కకు ఫోన్ చేసి తాము ఘర్షణ పడ్డామని, మానస అపస్మారక స్థితిలో ఉందని చెప్పాడు. ఆమె వెంటనే ఇంటి పక్కనే ఉన్న వారికి తెలపడంతో వారు వెళ్లి తలుపు కొట్టగా కొంతసేపటి తర్వాత శివకృష్ణ తలుపుతీసి బయటకు వచ్చాడు. వారు మానసను తట్టి లేపగా ఆమె లేవకపోవడంతో వెంటనే ఆటోలో లింగసముద్రంలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆయన పరిశీలించి మృతిచెందినట్లు ఉందని చెప్పడంతో.. దగ్గరలో ఉన్న ప్రాథమిక వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి మృతిచెందిందని నిర్ధారించారు. కానీ, మానస చనిపోలేదు.. ఇంకా బతికే ఉందని ఆటోలో కందుకూరు తీసుకెళ్తూ వలేటివారిపాళెంలో 108 సిబ్బందికి చూపించారు. వారు కూడా మానస చనిపోయిందని చెప్పడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. ఈ విషయంపై మానస తల్లిదండ్రులు పులి మాల్యాద్రి, రమణమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డీఎస్పీ కందుకూరు సీఐ డి.వెంకట్రావుతో కలిసి మృతదేహాన్ని పరిశీలించారు. మానస మెడకు గాయాలయ్యాయని, ఇది హత్యేనని అనుమానంగా ఉందని బాధిత తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు

కొండాపురం: ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలైన ఘటన బుధవారం సాయంత్రం రామానుజపురం - చోడవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు మధ్యలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సత్యవోలు పంచాయతీకి చెందిన కొందరు మహిళలు కావలిలో ఓ కార్యక్రమానికి వెళ్లి ఆటోలో తిరిగొస్తున్నారు. కొండాపురం ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు యువకులు మోటార్‌బైక్‌పై కావలి నుంచి కొండాపురం వెళ్తున్నారు. ఆటోని బైక్ ఓవర్‌టేక్ చేయబోయింది. ఇది గమనించి డ్రైవర్ ఆటోని పక్కకి తిప్పగా బైక్ తగిలి అదుపు తప్పింది. అలాగే ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో వారిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటన జరిగింది ఏ మండలమో ఖరారు చేసుకుని కేసు నమోదు చేస్తామన్నారు.